కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ పార్లమెంటరీ నియోజవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను సాధారణ పరిశీలకులు పీఐ శ్రీవిద్య పరిశీలించారు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నిజాం కళాశాల, కోఠిలోని మహిళా యూనివర్సిటీల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా, ఏసీపీ ఫయాజ్, హైదరాబాద్ ఆర్డీఓ కే. మహిపాల్ రెడ్డి, ఏఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చు

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని హైదరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులుగా పిఐ శ్రీవిద్యను కేంద్ర ఎన్నికల సంఘం నియమించిందని తెలిపారు. హైదరాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదులను జనరల్ అబ్జర్వర్ ను సెల్ నెంబర్ 91543 42023 ద్వారా సంప్రదించవచ్చన్నారు. అదే విధంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12,సిటీ మేనేజర్స్ ట్రైనింగ్ సెంటర్, 3వ ఫ్లోర్, హైదరాబాద్ ఉదయం 8.30 నుండి 9.30 గంటల మధ్య నేరుగా కలిసి ఫిర్యాదులు, సూచనలు అందజేయవచ్చని సూచించారు.

విదేశీవిద్య 'స్కాలర్‌షిప్స్'కు సహకారం

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ సహిత ప్రవేశాలను అందించడంలో సహకారం అందించనున్నట్లు నగరానికి చెందిన జూనియర్ కళాశాల టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాలో బీటెక్ చేయాలనుకునే 11వ, 12వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలతో ప్రారంభించి ఐఈఎల్ టీఎస్/టోఫెల్ తయారీ, అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు అప్లికేషన్ వరకూ మద్దతు అందిస్తామని, వీసా సహాయం, మెరిట్ లేదా అవసరాల ఆధారితంగా ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర స్కాలర్‌షిప్‌లు అందుకోవటంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యూఎస్ఏకు అధ్యయన పర్యటనలకు కూడా సహాయ పడతామని వివరించారు.

INTERVIEW

- బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు
- బీఆర్ఎస్ శ్రేణులే నా బలం-బలగం
- మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కాంగ్రెస్ వైఫల్యాలే ప్రచారాస్త్రాలు

మల్కాజిగిరిలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

"మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు చూపే ఆదరణను జీవిత కాలం గుర్తుంచుకుంటానని, ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. 25 ఏళ్లుగా పార్టీలకతీతంగా ప్రజల్లో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తుంచుకుని ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారన్నారు. తన మంచి తనమే తనను ఈ స్థాయికి తీసుకువచ్చిందన్నారు. బీఆర్ఎస్ తనకు కొత్త రాజకీయ జీవితాన్ని అందించిందని, అందుకు పార్టీ అధినేత కేసీఆర్, కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.
వచ్చే రోజుల్లో పెద్ద ఎత్తున పాదయాత్రలు, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుతో రోడ్డు షోలు, ప్రత్యేక సభలను నిర్వహించి కాంగ్రెస్ 100 రోజుల పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తామన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలిట అంకుశమవుతానని, ప్రభుత్వ పనితీరును ఎండగట్టే అవకాశం తనకు కల్పించాలని మల్కాజిగిరి ఓటర్లను కోరారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాల్లో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. రాగిడి లక్ష్మారెడ్డి మనోభావాలు ఆయన మాటల్లోనే.."

– ఉప్పల్



ప్రశ్న: లోక్‌సభ నియోజకవర్గంలో మీకున్న బలం..?

రాగిడి: అదృష్టవశాత్తు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీఆర్ఎఎస్ ఎమ్మెల్యేలుగా ఉండటం నా బలం , బీఆర్ఎస్ శ్రేణులు అండగా ఉంటూ సైనికుల్లా పని చేస్తున్నారు.

ప్రశ్న: నియోజకవర్గాల్లో మీ బలహీనతలు?

రాగిడి: మల్కాజిగిరి పార్లమెంట్ అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు. ఒక్కసారి ప్రచారం ప్రారంభమైతే అప్పుడు ఎదుటి పార్టీలకు దడ పుడుతుంది. శత్రువునైనా చేరదీస్తా, అదే నా బలహీనత.

ప్రశ్న: ఏ పార్టీ అభ్యర్థి మీకు పోటీ..?

రాగిడి: కాంగ్రెస్, బీజేపీ రెండు ప్రధాన పార్టీలైనా.. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ఇక్కడి ప్రజలు నావైపు, నా పార్టీ వైపు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదు. బీజేపీ అభ్యర్థితోనే ప్రధానంగా పోటీ ఉంటుంది.

ప్రశ్న: మీ ప్రచారాస్త్రాలు ఏమిటి..?

రాగిడి: కాంగ్రెస్ 100 రోజుల పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులే మా ప్రచార అస్త్రాలు. ఆరు గ్యారంటీలకు ఆదిలోనే చరమగీతం పాడిన రేవంత్ ప్రభుత్వం పనితీరే మా ప్రచారం అస్త్రం. పథకాల అమలులో జాప్యంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, విద్యార్థులు, గ్రామాల్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాం. రోడ్లు బాగు చేశాం. తాగునీరు అందించాం. ఫ్లైఓవర్‌లు నిర్మించాం. ఉప్పల్‌లో శిల్పారామం నిర్మించాం. ఉప్పల్ చౌరస్తాలో ప్రమాదాలను నివారించడానికి స్కైవాక్ వంతెన ఏర్పాటు చేశాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా నిలిపాం. ఇవన్నీ మాకు కలిసివచ్చే అంశాలు..

ప్రశ్న: మల్కాజిగిరిలో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదా..?

రాగిడి: రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ఓడిపోతే మల్కాజిగిరి ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారు. మోస పూరిత మాటలతో ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాల్లో అడుగు పెట్టలేదు. మల్కాజిగిరి ఆయనకు జీవం పోసింది. అయితే ఆయన ఇక్కడి ప్రజల గుండెల మీద తన్ని వెళ్లాడు. ఏ ఒక్క సమస్యకు పరిష్కారం చూపలేదు. నిధులను మురగబెట్టి చోద్యం చూశాడే తప్ప పట్టించుకున్న పాపాన పోలేదు. తిరిగి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారో చెప్పాలి. కాంగ్రెస్, బీజేపీలు చౌకబారు ఎత్తుగడలతో బీఆర్ఎస్ నేతలకు గాలం వేస్తున్నారు. బీజేపీ దేశానికి ఆర్థిక నేరాలకు పాల్పడ్డవారిని, ప్రభుత్వ భూములు కబ్జా చేసుకున్న వారిని, పేదల భూములను లాక్కున్న వారిని స్వలాభాల కోసం పార్టీలో చేర్చుకుని క్లీన్ చిట్ ఇస్తోంది.

నిర్లక్ష్యం ఎవరిదీ.?

వదులుగా ఉన్న విద్యుత్ తీగలు సరిచేయని అధికారులదా..? లేక తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించని సిబ్బందిదా?

- కూకట్‌పల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం
- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని వాహనాలు దగ్ధం
- 23 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో కాలిపోయిన వైనం
- ఫుట్‌పాత్‌పై ఉన్న పంక్చర్, కూలర్ దుకాణం దగ్ధం



కూకట్‌పల్లిలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన కూలర్లషాపు, పంక్చర్ షాపు, బైక్‌లు

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 23 బైక్‌లు, ఒక ఆటో, కూలర్ షాపు, పంక్చర్ షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆనుకొని మెట్రో పిల్లర్ నం.838 వద్ద జాతీయ రహదారిపై ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై కూలర్ షాపు, పంక్చర్‌షాపు డబ్బాలు ఉన్నాయి. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లను పార్కింగ్ చేశారు. బైక్‌లు కనిపించకూడదని అడ్డుగా జాలీతో పాటు గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. పంక్చర్‌షాపు డబ్బా వద్ద విద్యుత్ స్తంభం వైరు వదులుగా ఉండటంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

- మొదటగా పంక్చర్, కూలర్ దుకాణాలకు మంటలు అంటుకున్నాయి. వెంటనే పక్కనే ఉన్న గ్రీన్ మ్యాట్‌కు మంటలు అంటుకోవటంతో అక్కడే ఉన్న వాహనాలకు పాకాయి. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే కూలర్ షాపు, పంక్చర్‌షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. వీటితో పాటు 23 బైక్‌లు, 1 ఆటో కూడా పూర్తిగా కాలిపోగా, 22 బైక్‌లు కాలిపోయాయి. సీజ్ చేసిన బైక్‌లు అయినప్పటికీ బైక్‌లలో పెట్రోల్ ఉండటంతో మంటలు త్వరగా అంటుకున్నాయి.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో 809 బైకులు

- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సుమారు 809 బైక్‌లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. వాహనాల మధ్య దూరం ఎక్కువ ఉండటంతో ఒకే వరుసలోని వాహనాలకు మంటలు అంటుకున్నాయని పేర్కొన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉండి నోటీసులు పంపినా కానీ యజమానుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవటంతో మొయినాబాద్‌కు పంపించే వాహనాలే దగ్ధమయ్యాయని పోలీసులు తెలిపారు. వారం కిందటే 63 బైక్‌లను మొయినాబాద్‌కు పంపామని.. వచ్చే ఆదివారం ఈ వాహనాలను కూడా పంపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ ఆలోపే ఈ ప్రమాదం సంభవించిందని తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఆస్తి నష్టాన్ని అంచనా వేయలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చెట్ల కొమ్మలు తగిలి మంటలు వస్తుండేవి: స్థానికులు

- నాలుగు రోజుల నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతూ పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు తగిలి ప్రతి రోజు గాలులకు మంటలు వస్తూ ఉండేవని స్థానికులు పేర్కొంటున్నారు. చెట్ల కొమ్మలు తొలగించినా.. విద్యుత్ వైర్లను సరిచేసినా ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు.



బెంగాల్ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయాలు



గంజాయితో పట్టుబడ్డ సద్దాం హుస్సేన్

మూసాపేట: ఈజీ మనీ కోసం అలవాటు పడి కూలి పని చేసుకుంటూ గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెస్ట్ బెంగాల్ శ్యామ్‌నగర్‌కు చెందిన సద్దాం హుస్సేన్ (32) మూసాపేటలోని అంజయ్యనగర్‌లో ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నాడు. వెస్ట్ బెంగాల్ నుంచి గంజాయి తీసుకొచ్చి తోటి కూలీలకు విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు గంజాయి విక్రయిస్తుండగా సద్దాం హుస్సేన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి గది నుంచి 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

రూ.25.5 లక్షల నగదు పట్టివేత

కూకట్‌పల్లి: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును సైబరాబాద్ ఎస్ఓటీ బాలానగర్ టీమ్, కేపీహెచ్‌బీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. శుక్రవారం జేఎన్‌టీయూ ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు అటుగా వచ్చిన రైటర్ పీఎస్ క్యాష్ లాజిస్టిక్స్ వాహనాన్ని ఆపి సోదా చేశారు. వాహనంలో రూ. 25.50ల నగదును గుర్తించిన పోలీసులు అందుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ టు సూడాన్!



- సముద్రమార్గం ద్వారా అక్రమంగా సెల్‌ఫోన్ల తరలింపు
- జగదీష్ మార్కెట్ కేంద్రంగా కొన్నేళ్లుగా సాగుతున్న దందా
- తక్కువ ధరకే బ్రాండెడ్ ఫోన్లు, విడిభాగాల విక్రయం
- ఫోన్లు కొట్టేసేందుకు జీతాలిస్తూ నిరుద్యోగుల నియామకం
- 17 మంది కూడిన అంతర్జాతీయ ముఠా అరెస్టు
- రూ.1.75 కోట్ల విలువ చేసే 703 ఫోన్లు స్వాధీనం
- హైదరాబాద్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఫోన్లను దొంగిలించడమే ఉద్యోగంగా నిరుద్యోగ యువతను నియమించుకుని నగరంలో మొబైల్స్‌ను కొట్టేస్తున్నారు. ఆపై వీటిని జగదీష్ మార్కెట్ కేంద్రంగా సముద్ర మార్గం గుండా అక్రమంగా సూడాన్ దేశానికి తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఈ దందా సాగిస్తున్న 17 మంది సభ్యుల ముఠాను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 12 మంది స్థానికులతో పాటు ఐదుగురు సుడాన్ దేశీయులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.75 కోట్ల విలువ చేసే 703 ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు.

- గత కొద్ది రోజులుగా నగరంలో మొబైల్ దొంగతనాల కేసులు ఎక్కువయ్యాయి. ఈ నేరాల సరళిని విశ్లేషించగా.. స్నాచర్లు ఫోన్లను దొంగిలించేందుకు, వీటిని చట్టవిరుద్ధంగా ఇతర దేశాలకు తరలించేందుకు జాతీయ, అంతర్జాతీయ వ్యాపారులతో కూడిన నెట్‌వర్క్ ముఠాగా ఏర్పడినట్లు తేలింది. కొట్టేసిన సెల్‌ఫోన్ల నుంచి మొబైల్ స్క్రీన్లు, కెమెరాలు, స్పీకర్లు ఇతర విడిభాగాలను వేరు చేసి వాటిని కంపెనీ నిర్ణయించిన రేట్ల కంటే తక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఈ విడిభాగాలను పాడైపోయిన సెల్‌ఫోన్లకు వినియోగించి కొత్త ఫోన్లుగా మార్కెట్‌లో విక్రయించి రెట్టింపు సొమ్ము చేసుకుంటున్నారు.
- డెకొరేషన్ పని చేసే తాడ్‌బన్‌కు చెందిన మహ్మద్ ముజామ్మిల్ అలియాస్ ముజ్జు, జహనుమా ప్రాంతానికి చెందిన లారీ మెకానిక్ సయ్యద్ అబ్రార్ ఇద్దరు స్నేహితులు. విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన వీరు అర్ధరాత్రిళ్లు రోడ్ల మీద తిరుగుతూ నిర్మానుష్య ప్రాంతాల్లో వెళుతున్న బాటసారులను భయభ్రాంతులకు గురి చేసి సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. చోరీ చేసి పారిపోయేందుకు వీలుగా ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో బజాజ్ పల్సర్ బైక్‌ను దొంగిలించారు. దీనిపై తిరుగుతూ బండ్లగూడ, ఫలక్‌నుమా, బహదూర్‌పుర, మంగళ్‌హాట్, హయత్‌నగర్ ఠాణాల పరిధిలో సెల్‌ఫోన్లను చోరీలకు పాల్పడ్డారు.

థర్మల్ బాక్సుల్లో సూడాన్‌కు...

- సూడాన్ దేశానికి చెందిన ఖలీద్ అబ్దేల్‌బాగీ అహ్మద్ అల్బదీవ్, అబ్దలేలా అహ్మద్ ఉస్మాన్ బాబికర్, ఐమ్నే మహ్మద్ సలీహ్ అబ్దల్లా, అనస్ సిద్ధీఖ్ అబ్దేల్‌గాదర్ అహ్మద్, ఒమర్ అబ్దుల్లా ఎల్తాయెబ్ మహ్మద్‌లు చదువు, వ్యాపారం పేరుతో నగరంలో అక్రమంగా నివాసం ఉంటున్నారు. వీరిలో అలదీవ్‌కి మాసబ్‌ట్యాంక్‌లో సెల్‌ఫోన్ దుకాణం ఉంది. ఇతను జగదీష్ మార్కెట్‌లో ఫోన్ల వ్యాపారి మహ్మద్ షఫీ అలియాస్ బబ్లూ నుంచి మొబైల్స్ కొనుగోలు చేసేవాడు. ఆపై వీటిని సీ ఫుడ్‌ను తరలించే థర్మల్ బాక్సులలో భద్రపరిచి, సముద్ర మార్గం ద్వారా అక్రమంగా సూడాన్‌కు తరలిస్తున్నాడు.

ఫోన్లు చోరీ చేయడమే ఉద్యోగం..

ఫోన్లను చోరీ చేయడమే పనిగా నిరుద్యోగ యువతకు జీతాలు ఇచ్చి మొబైల్ స్నాచింగ్‌లు చేయిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత వీరు నిర్మానుష్య ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్తున్న వారి నుంచి, రద్దీ ప్రాంతాల్లో మాటల్లో పెట్టి దృష్టి మరల్చిఫోన్లు, జేబులోని నగదును దొంగిలిస్తున్నారు. ఇప్పటివరకు ఈ ముఠాపై పలు ఠాణాల్లో కేసులున్నాయి. ఈ మేరకు నిఘా పెట్టిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ముజామ్మిల్, సయ్యద్ అబ్రార్, సయ్యద్ సలీం, పఠాన్ రబ్బానీ ఖాన్, మహ్మద్ అథర్, మహ్మద్ జాకీర్, షేక్ అజార్, మహ్మద్ ఖాజా నిజాముద్దీన్, సయ్యద్ లయిఖ్, షేక్ అజర్ మొయినుద్దీన్, మహ్మద్ షఫీ, జే యలమందా రెడ్డి, సూడాన్ దేశానికి ఐదుగురిని అరెస్టు చేశారు.

కారు గుర్తుపై ఓటేద్దాం..

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోకసభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మద్దతుగా శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రచారం చేశారు. అంతకు ముందు ఆయన రిక్షాపుల్లర్స్ కమ్యూనిటీహాల్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



మక్కాల సత్యనారాయణకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మక్కాల సత్యనారాయణ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పలు ప్రాంతాలలో ఆయనతో కేక్‌లను కట్ చేయించి శాలువాతో సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. నిండు నూరేళ్లు జీవించాలని ఎమ్మెల్యే ఆశీర్వాదించారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ధరణినగర్‌లో చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రచారం చేశారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి సంజీవరెడ్డి, బి.కృష్ణ ముదిరాజ్‌లు, నాయకులతో కలిసి కరపత్రాలు పంచుతూ, హస్తం గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. డా. రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, భాస్కర్‌రెడ్డి, గుడ్ల శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, బాలస్వామి, పి.రాజబాబు, మహిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ గెలుపు ఖాయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



బాలానగర్‌లో ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలానగర్ డివిజన్‌లో ఈటల రాజేందర్‌తో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... దేశ రక్షణ, శాంతి భద్రతలు, దేశ ఆత్మ గౌరవం, దేశ ఆర్థికాభివృద్ధిని కాపాడగలిగే శక్తి కేవలం ప్రధాని నరేంద్ర మోదీకే ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల్లో డబ్బును, మద్యాన్ని నమ్ముకుని ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. బీజేపీ మాత్రం దేశాభివృద్ధిని చూపిస్తూ ఓట్లు అడుగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఓటర్లు ఈసారి బీజేపీకే పట్టం కట్టేందుకు నిర్ణయించుకున్నారని తెలిపారు.

◆ అనంతరం పార్టీ కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే మన నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీజేపీకి ఈసారి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో అభివృద్ధిని చూసి మోదీ నాయకత్వాన్ని గుర్తించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్‌లోని కోర్టు వద్ద ఈటల రాజేందర్‌తో న్యాయవాదులు

బీజేపీకే న్యాయవాదుల మద్దతు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని కోర్టు వద్ద మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీకి మద్దతు తెలపాలని న్యాయవాదులను కలిసి ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ పార్టీకే తమ పూర్తి మద్దతు ఉంటుందని న్యాయవాదులు తెలిపినట్లు వారు వెల్లడించారు.

అమ్మవారికి ఈటల పూజలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ సీ-బ్లాక్‌లో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయాన్ని మల్కాజ్‌గిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈటల రాజేందర్‌ను ఆలయ నిర్వాహకులు సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీనగర్ సీ-బ్లాక్‌లోని నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న ఈటల రాజేందర్

పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ పోస్టులు పెట్టొద్దు

- మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి
- విబేధాలను విడిచిపెట్టి అందరిని కలుపుకుపోవాలి



కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్

బాలానగర్: కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని... ఇంటి సమస్య ఇంట్లోనే పరిష్కరించుకోవాలని అలా కాదని రచ్చకెక్కితే అలాంటి వారిని పార్టీ ఎట్టి పరిస్థితులోనూ ఉపేక్షించదని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, కోఆర్డినేటర్ వినయ్‌రెడ్డితో కలిసి నియోజకవర్గస్థాయి నాయకులతో శుక్రవారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... ఐదు నుంచి పది మందితో బూత్ కమిటీల ఏర్పాటును ఒకటి రెండు రోజుల్లోనే పూర్తి చేయాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టవద్దని తెలిపారు.

◆ బండి రమేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ గెలుపు అభివృద్ధికి మలుపు అని అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పట్నం సునీతను ఎట్టి పరిస్థితులో గెలిపించుకొని తీరాలన్నారు. ఎన్నికల అనంతరం నియోజకవర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. డివిజన్ నాయకులు ప్రతి ఒక్క కార్యకర్తను కలుపుకొని పోవాలన్నారు. విబేధాలను విడిచి పెట్టాలని సూచించారు.

◆ కో-ఆర్డినేటర్ వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయకులు అందరినీ కలుపుకొని వెళ్లాలన్నారు. ఎవరు తనను వ్యక్తిగతంగా పిలవలేదని భావించవద్దన్నారు. పార్టీ గెలుపు మనందరిపైన ఉందన్నారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో, ప్రభుత్వంలో కమిటీల్లో మంచి గుర్తింపు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమన్వయమే పార్టీకి శ్రీరామ రక్ష

మూసాపేట: కార్యకర్తల సమన్వయమే పార్టీకి శ్రీరామ రక్ష అని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మూసాపేట డివిజన్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలో ఆయన సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బండి రమేష్ మాట్లాడుతూ... పార్టీ ఓటుతో పాటు న్యూట్రల్ ఓటర్‌లను కూడా ఆకర్షించేలా నాయకుల నుంచి బూత్ ఏజెంట్ వరకు గట్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలు ఇంటి దగ్గరున్న ఓటర్‌ను బూత్ వద్దకు తీసుకువచ్చి ఓటు వేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యకర్తలు సూచించిన సలహాలు, సూచనలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు కర్క పెంటయ్య, తూము శ్రీనివాస్, తూము ఎల్లారావు, కొప్పిశెట్టి రాఘవేంద్ర, చున్నా పాషా, వేణు, మనోజ్, నారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నాం



టి.అంజయ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శిరీష, నాయకులు

కూకట్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ధర్మారెడ్డి కాలనీ నుంచి 3వ ఫేజ్ వరకు శుక్రవారం రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజనీతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ హయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుకున్నామని అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డికి ఈ డివిజన్ నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, కట్టా నరసింహారావు, రాజేష్, సాయి శ్రీనివాస్, పాతూరి గోపి, వెంకటరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏవీబీపురంలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మద్దతుగా కూకట్‌పల్లి ఏవీబీపురంలో శుక్రవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కూకట్‌పల్లి మరింత అభివృద్ధి చేసుకోవాలంటే రానున్న ఎంపీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేయాలని కోరారు.



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, అభ్యర్థి సతీమణి రాగిడి రజనీ

లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మూసాపేట: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు శుక్రవారం బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు ప్రచారం చేశారు.రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టి. అంజయ్యనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డివిజన్ అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్ గౌడ్, ఖాజా పాషా, ఫయాజ్, యాధుల్, ఖదీర్, గౌస్, సప్పిడి శ్రీనివాస్‌రావు, రవీందర్, సమీర్, థాఫిక్, అనితా శ్రీపాద, సావిత్రి, స్వప్న, అన్నపూర్ణ, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.